## క్లుప్తంగా

### పనులు త్వరగా పూర్తి చేయాలి

**పెద్దకడబూరు :** మనబడి నాడు – నేడు కింద మంజూరైన అదనపు తరగతి గదులను త్వరగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఏఈ మల్లయ్య సూచించారు. మండలంలోని హెచ్.మురవణి గ్రామంలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల శ్లాబ్ పనులను గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ హైస్కూల్‌కు అదనపు తరగతి గదులకు సంబంధించి ఒక్కో గదికి రూ.12లక్షల ప్రకారం 10తరగతి గదులకు రూ.1.20కోట్లు మంజూరయ్యాయని చెప్పారు.

### ఖాదర్‌లింగ స్వామికి ఫాతెహాలు

**కౌతాళం:** స్థానిక జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు అధికంగా తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. భక్తుల రాకతో దర్గా పరిసరాలు నిండిపోయాయి.తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలు చేపట్టారు.

### వేతనాలు పెంచాలి

**ఆదోని రూరల్ :** అంగన్‌వాడీ ఉద్యోగుల వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటమ్మ కోరారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక సీడీపీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ వర్కర్లతో కలిసి ఆందోళన చేపట్టారు. అనంతరం సీడీపీఓ కార్యాలయ అధికారి శంకర్‌కు వినతి పత్రం అందజేశారు.

### పెరుగుతున్న అడ్మిషన్లు

**కోసిగి:** మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరే విద్యార్థుల సంఖ్య పెరిగిందని ఎంఈఓ మెయినుద్దీన్ తెలిపారు. గురువారం నాటికి 1వ తరగతిలో 371, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు 6వ తరగతిలో చేరేందుకు 112 మంది విద్యార్థులు ఇప్పటికే అడ్మిషన్లు తీసుకున్నారని చెప్పారు. జేబీఎం హెచ్ ఎం రాజమౌళి ఆధ్వర్యంలో 1వ తరగతిలో 16 మంది పాఠశాలలో చేరారు.

### ఆసుపత్రిలో పారిశుద్ధ్య పనులు

**ఆదోని టౌన్ :** స్థానిక మాతాశిశు సంరక్షణ కేంద్రంలో కొంతకాలంగా పెరిగిపోయిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు, భవనాల కూల్చివేత సమయంలో మట్టి, రాళ్ల కుప్పలను గురువారం తొలగించారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి ఆసుపత్రి ఆవరణను శానిటరీ సిబ్బందితో శుభ్రం చేయించారు.

### రేపు వాహనాల వేలం

**ఆదోని రూరల్ :** అనంతపురం సెబ్ డీసీ ఆదేశాల మేరకు నంద్యాల ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీధర్ ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీన ఆదోని సెబ్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన వాహనాలకు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు సెబ్ సీఐ హరికృష్ణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ సెబ్‌స్టేషన్ ఆవరణలోనే వేలం పాటలు నిర్వహిస్తామన్నారు. నాలుగు కార్లు, మూడు ఆటోలు, 19 మోటార్ సైకిళ్లకు సంబంధించి వేలం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

### పత్తి విత్తనాలు స్వాధీనం

**ఆదోని రూరల్ :** మండలంలోని పెద్దహరివాణం గ్రామంలోనున్న శ్రీ బన్నిమహంకాళి అమ్మదేవి ట్రేడర్స్‌లో అనుమతులు లేకుండా పత్తి విత్తనాలు విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు బుధవారం రాత్రి ఏడీఏ గిరీష్‌తో కలిసి తనిఖీ చేశామని ఆదోని ఏఓ అశోక్‌కుమార్‌రెడ్డి గురువారం తెలిపారు. దీంతో కర్ణాటక రాష్ట్రానికి చెందిన 289 పత్తి ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, దుకాణ యజమాని వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. వీటి విలువ రూ.2,46,5117 ఉంటుందని పేర్కొన్నారు.

### చర్యలు తీసుకోవాలి

**ఆదోని సెంట్రల్:** ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ మార్గదర్శాలను నిర్లక్ష్యం చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ బాధ్యుడు నీలకంఠప్ప, పట్టణ కార్యనిర్వాక అధ్యక్షులు దిలీప్ ధోకా గురువారం తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలు, యూని ఫాం పేరుతో డబ్బులు దండుకుంటున్నాయని, చర్యలు తీసుకోవాలని కోరారు.

### కర్ణాటక బస్సు ఢీ.. ఒకరు మృతి

**మంత్రాలయం :** మండలంలోని మాధవరం గ్రామ శివారు బ్రిడ్జి వద్ద కర్ణాటక ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో వ్యక్తి గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కోసిగి మండలం దుద్ది గ్రామానికి చెందిన మైఖేల్, కోసిగికి చెందిన తాయన్న అలియాస్ సంసోన్ ప్రయాణిస్తున్న బైక్‌ను కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో సంసోన్ మృతి చెందగా, మైఖేల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మైఖేల్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కర్నూల్‌కు తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

### రాజగోపుర నిర్మాణానికి విరాళం



దాతలకు బాండును అందజేస్తున్న దృశ్యం

**కౌతాళం:** ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి గురువారం ఎమ్మిగనూరుకు చెందిన రామలక్ష్మమ్మ, అల్లప్ప దంపతులు రూ.1,00,111లను విరాళంగా అందజేశారు. అలాగే.. తెలంగాణ రాష్ట్రం అయిజకు చెందిన పి. శారదమ్మ, ఆమె కుటుంబ సభ్యులు 40 గ్రాముల బంగారాన్ని అందజేశారు.

### వైద్యం, వాహన సేవలు బాగున్నాయి..



నా పేరు పార్వతి. మాది కర్ణాటక రాష్ట్రంలోని రారావి సమీపంలోని ముదేనూరు గ్రామం. ఆంధ్రాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు బాగా చేస్తారని బంధువుల ద్వారా తెలిసింది. దీంతో ఆదోని మాతా శిశు సంరక్షణ కేంద్రానికి కాన్పు కోసం వచ్చాను. మొదటి కాన్పులో మగబిడ్డకు జన్మనిచ్చాను. కాన్పు బాగా జరిగింది. వైద్యులు, సిబ్బంది బాగా చూసుకున్నారు. ఆదోని నుంచి 25 కి.మీ. దూరంలోనున్న మా ఊరికి ప్రసవం అనంతరం వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో వదులుతుండటం సంతోషంగా ఉంది'.

### నన్ను, నాబిడ్డను జాగ్రత్తగా చూసుకున్నారు..



మాది ఆలూరు మండలంలోని ముద్దనగేరి. నాకు ఇది రెండో కాన్పు. గర్భం దాల్చినప్పటి నుంచి కాన్పు చేయడం వరకు ఆదోనికి ప్రత్యేకత ఉంది. ప్రతి నెల పరీక్షలు చేసి, మందులు ఇచ్చారు. కాన్పు సమయంలో ఏఎన్ఎం సాయంతో ఆదోనికి వచ్చా. ప్రస్తుతం మగబిడ్డ పుట్టాడు. నన్ను, నాబిడ్డను ఇక్కడి వైద్యులు, సిబ్బంది చాలా జాగ్రత్తగా చూసుకున్నారు. ఇప్పుడున్న ప్రభుత్వం మంచి చర్యలు చేపట్టింది. బిడ్డతో సహా నన్ను మా ఇంటి వద్ద ప్రత్యేక వాహనంలో దిగబెట్టడం చాలా సంతోషంగా ఉంది.

# తల్లీబిడ్డ సంరక్షణకు..

- ప్రసవం అనంతరం తల్లీబిడ్డను ఉచితంగా ఇంటికి చేరుస్తున్న 'వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్'
- గతేడాది ఏప్రిల్ నుంచి 5,528 మంది బాలింతలను ఇంటికి చేర్చిన ప్రభుత్వం
- డివిజన్‌లో సేవలందిస్తున్న 25 వాహనాలు





తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో స్వగ్రామాలకు తరలివెళ్తున్న బాలింతలు

**ఆదోని టౌన్ :** తల్లీబిడ్డల సంరక్షణ బాధ్యతను వైఎస్సార్‌సీపీ చేపట్టింది. ఇందులో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం అనంతరం తల్లీబిడ్డలను క్షేమంగా స్వగ్రామాలకు ఉచితంగా, సురక్షితంగా చేర్చడమే వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల లక్ష్యం. వైఎస్సార్ ప్రభుత్వం వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. కార్పొరేట్ వైద్యానికి దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యాన్ని అందిస్తోంది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేయించుకొని ఆర్థికంగా నష్టపోవద్దని ప్రభుత్వం సూచిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితమని చెబుతోంది. ఆసుపత్రిలోచేరినప్పటి నుంచి ఇంటికి చేర్చే వరకు బాధ్యతగా చూసుకుంటోంది.

**డివిజన్‌లో 25 'తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు'..**

ఆదోని డివిజన్‌లోని ఆదోని, ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోసిగి, పెద్దకడబూరు, పెద్ద తుంబళం, పెద్దహరివాణం, కౌతాళం, నందవరం, చిప్పగిరి, ఆస్పరి, హాలహర్వి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు పనిచేస్తున్నాయి. ఆయా వాహనాల ద్వారా నెలకు వందలాది మంది మహిళలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం చేయించుకున్న అనంతరం వారి గమ్యస్థానాలకు ఉచితంగా చేరుస్తున్నాయి. 2022 ఏప్రిల్ 1న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డాక్టర్ వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లను ప్రవేశపెట్టారు. గత ప్రభుత్వం హయాంలో ఈ వాహనాలు ఉన్నప్పటికీ పేదలకు పెద్దగా ప్రయోజనం ఉండేది కాదు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆదోని మాతాశిశు సంరక్షణ కేంద్రం పరిధిలోని పీహెచ్‌సీలకు 25 వాహనాలను కేటాయించింది.

### చాలా సంతృప్తిగా ఉంది



ఆదోని మాతాశిశు సంరక్షణ కేంద్రంలో ప్రసవం చేయించుకున్న బాలింతలు, చంటిబిడ్డలను వారి స్వగ్రామాలకు చేరుస్తున్నాం. జగనన్న ప్రభుత్వ హయాంలో పేద మహిళలకు ఉచితంగా ఆపరేషన్లు, సీజేరియన్లు చేస్తోంది. పేదలను ఉచితంగానే డాక్టర్ వైఎస్సార్ తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్‌లో గ్రామాలకు చేరవేస్తున్నాం. ప్రజలు చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వాహనాల డ్రైవర్‌లుగా పనిచేయడం ఎంతో సంతృప్తినిస్తోంది.

– గురుప్రసాద్, వాహనడ్రైవర్ (కెప్టెన్)



మాతాశిశు సంరక్షణ కేంద్రంలో ఆగి ఉన్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు

**గతేడాది ఏప్రిల్ నుంచి తల్లీబిడ్డలను ఇళ్లకు చేర్చిన వివరాలు..**

| నెల | కేసులు |
|---|---|
| ఏప్రిల్ | 323 |
| మే | 324 |
| జూన్ | 351 |
| జూలై | 384 |
| ఆగస్టు | 425 |
| సెప్టెంబర్ | 370 |
| అక్టోబర్ | 424 |
| నవంబర్ | 419 |
| డిశంబర్ | 415 |

**2023 జనవరి నుంచి...**

| నెల | కేసులు |
|---|---|
| జనవరి | 355 |
| ఫిబ్రవరి | 330 |
| మార్చి | 408 |
| ఏప్రిల్ | 442 |
| మే | 393 |
| జూన్ | 165 |
| మొత్తం | 5,528 |

**పీహెచ్‌సీల వారీగా వాహనాల కేటాయింపు..**

| పీహెచ్‌సీ | వాహనాలు | పీహెచ్‌సీ | వాహనాలు |
|---|---|---|---|
| ఆదోని | 7 | ఆస్పరి | 1 |
| కోసిగి | 3 | ఆలూరు | 1 |
| పెద్ద తుంబళం | 3 | చిప్పగిరి | 1 |
| | | ఎమ్మిగనూరు | 5 |
| కౌతాళం | 1 | నందవరం | 1 |
| హొళగుంద | 1 | హాలహర్వి | 1 |

## విద్యకు పెద్దపీట వేసిన ఘనత జగన్‌దే



విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేసి అభినందిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

**మంత్రాలయం :** రాష్ట్రంలో విద్యాకు పెద్దపీట వేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాకానుక, ఆణిముత్యాలకు అభినందన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నేత వై.సీతారామిరెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా శ్రీ రాఘవేంద్రస్వామి చిత్రపటానికి పూజలు చేశారు. పది, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు ప్రభుత్వం ప్రకటించిన నగదు అందజేసి, షీల్డ్, ప్రశంసా పత్రం అందజేసి సత్కరించారు. అలాగే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే తో పాటు వై.సీతారామిరెడ్డిని ఎంఈఓ మోహినుద్దీన్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమిరెడ్డి, ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, ఎస్ఐ వేణుగోపాల్‌రాజు, సర్పంచ్ తెల్లబండ్లభీమయ్య, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, ఉపసర్పంచ్ హోటల్ పరమేష్, ఎంపీటీసీ సభ్యులు వెంకటేష్‌శెట్టి, హౌసింగ్ డీఈ లాల్‌కృష్ణయ్య ఉన్నారు.

**కోసిగి:** మంత్రాలయం నియోజకవర్గంలో జగనన్న ఆణిముత్యాల కార్యక్రమంలో మండలం టాప్‌గా నిలిచింది. గురువారం మంత్రాలయంలో నియోజకవర్గ స్థాయిలో అణిముత్యాలకు ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి విద్యార్థులకు సన్మానం, ప్రశంస పత్రాలు అందుకున్నారు. పదో తరగతి ఫలితాల్లో మొదటి స్థానంలో పి.రిజ్వానా 574 మార్కులు, ఎస్. అఫ్రోజ్ బాను 563 మార్కులు, వి.అక్షయ 561 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచింది. వీరికి వరుసగా రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు అందుకున్నారు. అలాగే ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన యు.మానస బైపీసీ గ్రూపులో 928 మార్కులు, బి.జానకి 912 మార్కులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి నరసింహులు హెచ్ఈసీ గ్రూపులో 734 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా ఒక్కొక్కరికి రూ.15వేల నగదు అందజేశారు.



విద్యాకానుక పంపిణీ చేస్తున్న దృశ్యం

**విత్తనాల పంపిణీ**

చెట్నేహళ్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన సబ్సిడీ వేరుశనగ విత్తనాలను ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి గురువారం రైతులకు అందజేశారు. ఏడీఏ ఖాద్రి, ఏఓ జీరాగణేష్, సర్పంచ్ అంజిని, ఉపసర్పంచ్ వీరనాగప్ప, ఎంపీటీసీ రామాంజినేయులు ఉన్నారు.

**రాఘవేంద్రుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే**

శ్రీ రాఘవేంద్రస్వామిని గురువారం రాత్రి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి దర్శించుకున్నారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనంకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పాత ఊరులో వెలసిన శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేపట్టారు.

## విద్యాకానుక కిట్ల పంపిణీ

**పెద్దకడబూరు :** ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు వరమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ రామాంజనేయులు పేర్కొన్నారు. మండలంలోని బసలదొడ్డి, కంబలదిన్నె, పెద్దకడబూరు గ్రామాల్లో గురువారం జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. స్థానిక ఆదిఆంధ్ర పాఠశాలలో ముందుగా గోరుముద్ద పథకంలో బాగంగా విద్యార్థులకు రాగిజావా పంపిణీ చేశారు. అనంతరం కానుక కిట్లును అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు సుప్రసాద్, ఉపాధ్యాయులు, కోసిగి మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ ముక్కరన్న పాల్గొన్నారు.

**కౌతాళం:** బదినేహాల్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం విద్యా కానుక కిట్లను పీఎంసీ చైర్మన్ మాలింగ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, రిటైడ్ వీఆర్ఓ వీరభద్రగౌడ్, ఉప సర్పంచ్ ప్రసన్నగౌడ్ పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు.

### శ్రీ మఠంలో మంత్రి ఉషశ్రీ చరణ్

**మంత్రాలయం:** శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు ఏపీ మంత్రి ఉషశ్రీచరణ్ గురువారం మంత్రాలయం వచ్చారు. వీరు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకు ముందు వీరికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, తహసీల్దార్ చంద్రశేఖర్, సీఐ శ్రీనివాసులు, ఐసీడీఎస్ అధికారులు ఉన్నారు.



మంచాలమ్మకు హారతినిస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

### బాలాజీ అగ్రికెమ్ ఫ్యాక్టరీ తనిఖీ

**ఆదోని రూరల్ :** ఆదోని–ఆలూరు ప్రధాన రోడ్డులో నున్న బాలాజీ అగ్రికెమ్, ఆదోని ఎన్‌పీకే మిక్సర్ ప్లాంట్‌ను మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ నుంచి అబ్జర్వర్ హిమాన్షు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎం.గిరీష్ గురువారం తనిఖీ చేశారు. ప్రతి మూడేళ్లకొకసారి తనిఖీలు చేపడతామని వారు తెలిపారు. మూడేళ్లలో జరిగిన అమ్మకాలు, నిల్వలు, లావాదేవీలను విచారించారు. ప్రభుత్వ అనుమతులకు లోబడే కార్యకలాపాలు చేసుకోవాలని సూచించారు. ఏఓ అశోక్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**ఆదోని రూరల్ :** కౌతాళం మండలంలోని బంటకుంట గ్రామానికి చెందిన మాల మల్లికార్జున (29) అనే వ్యక్తి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పెద్దతుంబళం ఎస్ఐ రమేష్‌బాబు గురువారం తెలిపారు. మల్లికార్జున ఈనెల 12న తన బంటకుంట నుంచి కల్లుబావి గ్రామంలోనున్న భార్య పుట్టినింటికి బైకుపై వస్తుండగా గణేకల్ వద్ద అదుపుతప్పి కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. మెరుగైన చికిత్స కోసం వైద్యులు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

## పేద విద్యార్థులకు అండగా ప్రభుత్వం

**ఆదోని సెంట్రల్ :** పేద విద్యార్థులకు అండగా నిలిచేందుకే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలతో పాటు ప్రతిభ చూపిన వారిని ప్రోత్సహిస్తోందని ఎమ్మెల్యే వై. సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో నియోజకవర్గంలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థినులను గురువారం ఘనంగా సత్కరించారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు అందజేసి, ప్రశంసా పత్రం, మెడల్ అందజేసి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన తదితర పథకాలతో పేద విద్యార్థులు విద్య దూరం కాకుండా ఆదుకుంటున్నారని చెప్పారు. విద్యార్థులకు పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థితికి చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పురపాలక చైర్మన్ బి.శాంతి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ తిమ్మప్ప, ఎంఈఓ బి.శివరాములు, ప్రిన్సిపాల్ సంజన్న, ప్రధానోపాధ్యాయులు వెంకటస్వామి, శ్రీకాంత్, శ్రీనివాసులు, సునీత, శాంతి పాల్గొన్నారు.



విద్యార్థులతో ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి, అధికారులు

**పట్టాలు అందజేత**

**ఆదోని రూరల్ :** మండలంలోని కుప్పగల్ గ్రామానికి చెందిన తొమ్మిది మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అందజేశారు. గురువారం తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన వారికి పట్టాలు అందించి మాట్లాడారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించిన సమయంలో చాలామంది ఇంటి స్థలాలు కలిగి ఉండి, వాటికి పొజిషనల్ సర్టిఫికెట్లు లేకపోవడాన్ని 70 మంది తన దృష్టికి తెచ్చారని, దీంతో తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఆర్ఐ జయరామిరెడ్డితో మాట్లాడి వారికి పొజీషన్ పట్టాలు అందించాలని ఆదేశించగా తొమ్మిది మందికి మంజూరయ్యాయని చెప్పారు. మిగిలిన 61 మందికి త్వరలోనే అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వీఆర్వో వామనరావు, సర్పంచ్ నాగిరెడ్డి పాల్గొన్నారు.



పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

**ఎరువులు, విత్తనాలు తరలిస్తే చర్యలు**

**మంత్రాలయం :** మండలం నుంచి కర్ణాటక రాష్ట్రానికి ఎరువులు, విత్తనాలను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ ఏడీఏ మహ్మద్‌ఖాద్రి తెలిపారు. గురువారం మండలంలోని సరిహద్దు చెక్ పోస్టు వద్ద మాధవరం ఎస్ఐ కిరణ్, ఏఓ జీరాగణేష్‌తో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు.

**చెన్నై–షిరిడీ రైలులో చోరీ**

**ఆదోని సెంట్రల్ :** చెన్నై – షిరిడీ రైలులో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేసినట్లు తెలిసింది. గురువారం రాత్రి రెండు గంటల సమయంలో దుండగులు మహిళ మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు ఆభరణాలను ఎత్తికెళ్లినట్లు సమాచారం. ఆదోని మండలం గణేకల్లు, కుప్పగల్ మధ్య దుండగులు రైలు చైను లాగి, ఆపి ఉన్న ట్రైనులో చోరీకి పాల్పడినట్లు తెలిసింది. బాధితులు రాయచూరు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఆదోని రైల్వే పోలీసు ఇన్‌స్పెక్టరు రామస్వామిని వివరణ కోరగా..చోరీపై తమకు సమాచారం లేదని చెప్పారు.

**ఉపాధ్యాయులను నియమించాలి**

**ఆదోని సెంట్రల్:** పట్టణంలోని ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ నాయకులు కోరారు. గురువారం ఉప విద్యాధికారి కార్యలయం ఎదుట నిరసన కార్యక్రమము చేపట్టారు. టీఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. షబీర్ బాషా, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ మాట్లాడుతూ పాఠశాలలో కొందరు ఉపాధ్యాయులు బదిలీ కావడంతో కేవలం ముగ్గురు మాత్రమే మిగిలారన్నారు. అధికారులు స్పందించి ఉపాధ్యాయులను నియమించాలని విజ్ఞప్తి చేశారు.

### గురుకుల పాఠశాలకు ఎంపిక



జి.సాయివర్షిత, ఎస్. మన్విత

**ఆదోని సెంట్రల్:** పట్టణంలోని అర్దగేరి బసవన్‌గౌడు పురపాలక ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు గురుకుల పాఠశాలలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున గురువారం తెలిపారు. ఐదవ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్షలులో జి. సాయివర్షిత ఆదోని మండలం అరేకల్‌లో ఉన్న మహాత్మజ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలకు, ఎస్. మన్విత పత్తికొండ మండలం బాలయోగి గురుకుల పాఠశాలకు ఎంపికైందని చెప్పారు. ఉపాధ్యాయులు పద్మావతి, గీత, ప్రమీలమ్మ, శ్రీనివాసులుతో కలిసి చిన్నారులను అభినందించారు.

**విత్తన వ్యాపారి అరెస్ట్ ?**

**ఆదోని అర్బన్ :** నాసిరకం విత్తనాలు విక్రయించారని రైతు ఫిర్యాదు మేరకు ఆదోనికి చెందిన ఓ విత్తన వ్యాపారిని బుధవారం సాయంత్రం తెలంగాణ పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లిన విషయం గురువారం వెలుగులోకి వచ్చింది. వరంగల్ జిల్లా చెన్నారావుపేటకు విత్తన వ్యాపారిని తీసుకెళ్లారని, ఆయన ఆన్‌లైన్‌లో పత్తి విత్తనాలను విక్రయించారని, నాసిరకంగా ఉండడంతో ఓ రైతు అక్కడి పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లలో విచారించగా తమకేమీ తెలియదని చెప్పారు.

## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

**మంత్రాలయం:** సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. గురువారం స్థానిక మంచాల–1 సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ సేవలను ఎప్పటికప్పుడు తక్కువ కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి పనితీరును మెరుగు పరుచుకోవాలని ఉద్యోగులను ఆదేశించారు. గ్రామంలో చెత్తసేకరణ, శానిటేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈవోపీఆర్డీ ప్రభావతి, సర్వేయర్ హరి ఉన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

## దిశ యాప్‌తో మహిళలకు భద్రత

**కోసిగి:** ఆపదలో ఉన్న మహిళలకు దిశ యాప్ భద్రతను కల్పిస్తుందని, ప్రతి ఒక్కరూ యాప్‌ను తమ సెల్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలని ఎస్ఐ రాజారెడ్డి సూచించారు. గురువారం స్థానిక నారాయణ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఉసేనయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు యాప్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మహిళలపై దాడులు, ర్యాగింగ్, అసభ్యకరంగా ప్రవర్తించినా, అత్యాచార యత్నాలు, గృహహింస వేధింపులు తదితర వాటిని యాప్ ద్వారా సమాచారం అందించాలన్నారు. అనంతర వైఎస్సార్ సర్కిల్‌లో మహిళా పోలీసులతో కలిసి యాప్ ఇన్‌స్టాల్ కార్యక్రమం చేపట్టారు.

**కౌతాళం:** దిశ యాప్ మహిళలకు రక్షణ కవచంగా నిలుస్తుందని ఎంపీడీఓ సుబ్బారాజు అన్నారు. మండలంలోని ఏరిగేరి గ్రామంలో పోలీసులు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌ను ఎంపీడీఓ పరిశీలించారు. కానిస్టేబుల్ నరేంద్ర, మహిళ పోలీసులు మౌనిక, అమృత, వెంకటేశ్వరిబాయి, తిరుపతిబాయి పాల్గొన్నారు.

**ఆదోని రూరల్ :** మండలంలోని కడితోట క్రాస్ వద్ద ఎస్ఐ చిన్నపీరయ్య ప్రజలకు దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. 1200 మంది మొబైల్ ఫోన్లలో యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించినట్లు చెప్పారు.

## 30 రోజుల్లో విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలి

**ఆదోని అర్బన్ :** రైతులు రుసుము చెల్లించిన 30 రోజుల్లోపే విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని విద్యుత్ శాఖ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్‌రావు ఆదేశించారు. గురువారం స్థానిక ఆర్ట్స్ కళాశాల సమావేశ హాల్‌లో డివిజన్‌స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులను ఇబ్బందులు పెట్టకుండా రుసుము చెల్లించిన వెంటనే కనెక్షన్ ఇచ్చి అవగాహన కల్పించాలన్నారు. అంతరాయాన్ని తగ్గించి నాణ్యమైన విద్యుత్‌ను వినియోగదారులకు అందించాలని సూచించారు. విద్యుత్ అధికారులు, ఓ అండ్ ఎం స్టాఫ్‌నకు నిర్దేశించిన హెడ్ క్వార్టర్స్‌లోనే ఉండి సేవలు అందించాలని చెప్పారు. విద్యుత్ బిల్లులు చెల్లింపులు ఆన్‌లైన్‌లో చేసేలా వినియోగదారులను ప్రోత్సహించడంతో పాటు అవగాహన కల్పించాలన్నారు. పెండింగ్ బిల్లులను త్వరగా వసూలు చేయాలన్నారు. అనంతరం రికార్డులు తనిఖీలు చేశారు. చీఫ్ జనరల్ మేనేజర్లు గురువయ్య, ధర్మజ్ఞాని, సూపరింటెండెంట్ ఇంజినీర్ ఉమాపతి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుధాకర్‌కుమార్, ఏడీఈ పురుషోత్తం, ఎస్ఏఓ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఏఈలు, ఏఏఓలు, జేఏఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంతోష్‌రావు

### పెద్దచెరువు సమస్య పరిష్కరించాలి

**ఆదోని రూరల్ :** హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న పాండవగల్ పెద్ద చెరువు సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు కోరారు. గురువారం ఈ మేరకు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. సర్వేనంబర్ 135లో ఉన్న 20 ఎకరాల పాండవగల్ పెద్ద చెరువుపై కోర్టులోనున్న కేసును వేగవంతం చేయాలని, ప్రస్తుతానికి సాగు చేయకుండా ఆపాలని విన్నవించారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అలాగే కోర్టులో కేసును వేగవంతం చేసి స్టే వెకెట్ చేయించాలని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, మండల కార్యదర్శి కె.లింగన్న, మండల నాయకులు రామాంజనేయులు పాల్గొన్నారు.

### శ్రీశ్రీ వర్ధంతి

**ఆదోని అర్బన్ :** పట్టణంలోని కర్రెప్ప హాస్టల్ సమీపంలో రంగస్థలం కళావేదికలో ఆదోని లలిత కళాసేవా సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ జి.నల్లారెడ్డి అధ్యక్షతన శ్రీశ్రీ వర్ధంతి సభను గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ప్రముఖ హార్మోనిస్టు రాతన అబ్దుల్లా, విరుపాపురం శివరాములు, రంగస్థలం కళాకారుడు చిగురి లక్ష్మన్నయాదవ్ శ్రీశ్రీ గొప్పతనాన్ని వివరించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.